


# శిథిల సమాధి

"సుధాకరా!" గంభీరంగా వినిపించింది చిదా నందస్వామి కంఠస్వరం.

"బాబా, వస్తున్నా!" వినయాన్ని వ్యక్తం చేశాడు సుధాకరుడు.

"సుధా, అల్లదిగో విను—సకల జీవరాసుల మనిశిత హృదయాల నొక్కసారి కదిలించివేసే గుడిగంటల ఆరావాన్ని. దీనజనులను, శరణాగతులను, భక్తిపరులను చేరదీసి రక్షించి ముక్తి నిచ్చే ఆ మవోహర శబ్దమే భగవంతుని అభయ స్వరం. దైవాన్ని ధ్యానించి, దైవ నిలయాన్ని నీకు చూపించి తెలుపవలసిన విషయాలు చాలా ఉన్నాయి. పద, పోదాం."


# Aromatic Chemicals Perfumery Compounds Resinoids Essential Oils

MANUFACTURED BY

**S. H. KELKAR & CO. P. LTD.**

*Office* : 36, Mangaldas Road, Bombay 2 BR. (Phone : 29130)
*Factory* : Bombay Agra Road, Mulund, Bombay 80 NB (Phone : 581398)
*Hyderabad Office* :
15-9-312, Shankar Mansion, Afzalganj, Hyderabad (A.P.)

KWALITY


సారంగ్ స్టైలును సమకూర్చును...

సారంగ్‌పూర్ కాటన్ మేన్యుఫేక్చరింగ్ కంపెనీ లిమిటెడ్, అహమదాబాద్


# శిథిల సమాధి

"బాబా, సిద్ధంగా ఉన్నాను."

మహా శిల్పి చిదానందస్వామి తన ఏకైక పుత్రునితో బయలుదేరాడు. మనుసిగ్గు దొంతరల నిమమడింపజేసికొన్న నూనూగు మీసాల నవ యౌవన విలాసంతో సౌందర్యకాంతులు వెదజల్లే అందాల సుధాకరుని మనోభిప్రాయాలను అర్థం చేసుకోలేకపోయాననే బాధ చిదానందస్వామి కళ్ళలో స్పష్టంగా గోచరిస్తూంది.

మౌన దేవతను మధ్య నుంచుకొని ఇద్దరూ దేవాలయ ప్రాంగణానికి చేరారు. తండ్రి కొడుకులు అక్కడే నిలిచారు.

"కుమారా, చూస్తున్నావా?"

"చూస్తూనే ఉన్నా, బాబా!"

"దేనిని?"

"శిల్ప సౌందర్యాన్ని."

"కాదు." గర్జించాడు తండ్రి. "ముందు సృష్టిని చూడు. ప్రకృతిలోగల ప్రతి వస్తువును పరిశీలించు. పరిశీలించిన ఫలితమేదో చెప్పు."

"బాబా! నాకన్నీ సర్వ శోభితంగా సమ్మోహనంగా కనుపిస్తున్నాయి. ఈ సంధ్యాసమయం, ఈ ఉద్యానవనం, కువలయ కమలాలతో నిండిన ఈ కోనేరు—వీనితో కూడుకొన్న ఈ సుందర ప్రదేశం ఇంకా చూడాలనిపిస్తుంది."

"ఛీ!" గర్జించాడు చిదానందుడు. "ప్రతిదానిని రసమయం చేస్తున్నావు. ఆ రసాన్ని ప్రతిపాదించిన పర స్వరూపాన్ని ఆలోచించు. సముద్ర ఘోష, పర్వతాల ప్రతిధ్వని, క్రూర మృగాల భీషణ రవం, తుమ్మెదల ఝంకారం అంటే ఏమిటి? జాజి మల్లెలకు తెలుపు, మందారాలకు ఎరుపు ఏల? ఎప్పుడైనా గమనించావా? అవన్నీ దైవానికి స్తుతిగీతాలు. ఆయా వస్తువులలోని విశేషమే భగవంతునికి భక్తిరాగమై నిరంతర ధ్యాన సమాధిలో గాన మాలపిస్తూ ఉంటుంది. మానవుడైతే స్వకార్యాలను సంపూర్తి చేసి సమయం చూచుకొని తీరికగా సేవిస్తాడు. అదే మానవులకు, జడవస్తువులకు గల భేదం. జగన్నాటక సూత్రధారుని లీలలే జగతికి మూలం. మనోనయ గోచరమైన ఆ లీలనే దర్శించి ఆ పరమ తత్వాన్ని నీ శిల్ప విద్యలో ప్రదర్శించు."

"బాబా, మీ పలుకులన్నీ అర్థం చేసుకుని తరించే స్థితి నాకులేదు. రససిద్ధి భగవంతునినుండి కలిగినదే అని, సౌందర్యమంతా విశ్వకర్త సమ్మోహన స్వరూపమే అని మీరే చెప్పారు. జీవకళ ఉట్టిపడే మీ శిల్ప సౌందర్యంతో దేవాలయం దేదీప్యమానమైనది. మీరు నిర్మించిన ఈ మహా శిల్పాల్లోని దేవదేవుని దివ్య కరుణారసమయ భంగిమలు సకల జీవరాసులకు సుఖానుభూతి నిచ్చేవే. అయినా, బాబా, చిన్ననాటనుండి నాకు కలిగిన సందేహం ఒకటి. ఈ శిల్పాల్లో నాట్య కళను కూడ చేర్చితే, సిద్ధ, సాధ్య, యక్ష కిన్నెరాది దేవతాంగనల నాట్య భంగిమలను చిత్రిస్తే మరెంతో బావుంటుంది.

**లక్ష్యం ఉత్తమమైనంతమాత్రాన సంతృప్తి చెందడానికి వీలులేదు. సాధనం కూడా ఉత్తమం కావడం ఆవశ్యకం. అలౌకికమైన సౌందర్య స్వరూపం దర్శించ గోరి తపస్సులో మునిగే మనిషి, సాధనం చేసుకొన్న రమణీయ భౌతికరూపమే సర్వస్వంగా పరిగణించి లక్ష్యాన్ని విస్మరించే ప్రమాదం ఎంతటిదో ఎలా చెప్పడం?**

దేవికైనా నిత్య నూతన సుందర స్వరూపమే ఆకర్షణీయమైనది. ఆ సౌందర్యాన్ని నాట్యకళ మూలమున చిందిస్తే? బాబా, ఇదే నా కోరిక. ఈవిధంగా చిత్రవిచిత్ర భంగిమలతో సర్వ సుందరంగా నాట్య శిల్పాలను నిర్మించి నాకు మీనుండి వచ్చిన శిల్ప విద్యకు పరిపూర్ణత్వం చేకూరుస్తాను. అనుజ్ఞ ఇవ్వండి."

"సుధాకరా, నీ వంటున్నది ఏమిటి? దేవ దేవుని ఆలయంపై నాట్య శిల్పమా—మోహాన్ని కలిగించే కామరూప శిల్పమా! అసంభవం."

"బాబా!" ఆక్రోశించాడు సుధాకరుడు. "నాట్యం శాస్త్రీయమైనదేగా? లాస్య తాండవాలు ఆది దంపతులనుండి వచ్చినవే అని మన హిందూ వేదసారాలు చెపుతున్నాయి గదా? ప్రళయాన్ని పరిమార్చి ప్రశాంతం చేయడానికి ప్రశాంతంలో పుట్టిన ప్రచండమైనదానిని ప్రళయంచేసి పరిమార్చి లోక కళ్యాణానికి తోడ్పడేవేగా లాస్య తాండవాలు?"

"సుధా!" ఒక్క నిట్టూర్పు విడిచాడు చిదానందుడు. "నీ వాదాన్ని నేను కాదనను. నీవు తలచిన శిల్ప నిర్మాణానికి వస్తు స్వరూప సాక్షాత్కారం కావాలి. నీవు కోరి నిర్మించే శిల్పరూపం నీవు కనుతెరిచినా, కనుమూసినా కనుపించాలి. దానినే చూడాలి. ఆ దృష్టికి అంతరాయం రారాదు. అలా కలిగితే దాని కదే అంతం. అది రామమైనది భగవంతుని ధ్యానం. ఆధ్యాత్మిక చింతన అపురూపమైనది. దాని నెవరూ కలిగించనూ లేరు. తిరిగి చెరుపనూ లేరు. దానికదే పుట్టాలి. నీవు నిర్మింపనున్నది నీ అనుభవానికి లోడైనది కాదు. నా కుమారుడు నాకు మించిన దేవశిల్పి కావాలని నా కాంక్ష. నా ఆశ వమ్ము కాకూడదు. నాట్యసుందరి నీ కనుసన్నల నీడలలో, నునువన్నెల జాడలలో నీ మదిలో, నీ ఎదుటే ఉండాలి. ఎలా సాధ్యం కాగలదు? ఒకవేళ ప్రయత్నించినా ఫలితాన్ని పొందలేవేమో? కడసారిగా నిరాశ నిస్సావహింపవచ్చు."

"బాబా!" కంఠం గాద్గదికమైంది. "అలా అనకండి. ఏమైనా ఈ నా ఆశయాన్ని మన దేవదాసి చిత్రలేఖద్వారా సాధిస్తాను. అనుజ్ఞ ఇవ్వండి." పాదాలపై వ్రాలాడు.

చిదానందుని హృదయం ద్రవించిపోయింది. కుమారుని దీనత్వాన్ని చూచి సహించలేక పోయాడు.

"నాయనా! ఎవ్వరూ ఇంతవరకు సాధించలేని ఈ మహా కార్యాన్ని నీవు సాధించగలిగితే సంతోషమే. అదిగో, చిత్రలేఖ పూజవేళకు వస్తూంది" అని, "అమ్మా! చిత్రలేఖా!" అని అనునయంగా పలకరించాడు.

"స్వామీ!" పాదాలకు నమస్కరించింది.

"నీవలన ఒక ఘనకార్యం సాధించవలసి ఉంది. నీ నాట్య భంగిమలు చూపి సుధాకరుని శిల్ప నిర్మాణానికి తోడ్పడగలవా?"

"స్వామీ!" నిరుత్తర అయిపోయింది. మరు మాట లేదు. క్షణంసేపు పోతపోసిన బంగారు విగ్రహమైంది. ఏవో చెప్పబోయి చెప్పలేక పోయింది.

"సుధాకరా! ఇక నీ వనుకున్న కార్యాన్ని సాధించు." గంభీరంగా అడుగులు వేసికొంటూ వెళ్ళిపోయాడు చిదానందుడు.

చుట్టూ నిశ్శబ్దం. చిత్రలేఖా సుధాకరుల చూపులే తప్ప నోటమాట లేదు. తల వంచుకు నిలబడిన చిత్రలేఖ సౌందర్యం సమీప స్థితిలోనే వేయి రెట్లధికమనిపించి అమితంగా మురిసి పోయాడు. మూగగా దాగిన భావా లేవో మెల్ల మెల్లగా పైకి వస్తున్నాయి.

"మీరు శిల్పంలో నాట్య విన్యాసాలను పొందిస్తారా?" తల వంచుకునే తీయగా అడిగింది.

"ఔను." ఆమెను చూస్తూనే అన్నాడు కమ్మని కంఠ మాధుర్యంలో కరిగిపోయిన సుధాకరుడు.

"అయితే మీ ఎదుట నేను నాట్యం చెయ్యాలా?"

"ఔను.....ఉహూఁ.....అంతగా శ్రమ లేదు. కొన్ని భంగిమల్లో నిల్చొనిఉంటే చాలు." తడబడిపోయాడు. ఆ తడబాటుకు అలవోకగా మెదిలిన చిరు దరహాసంతో కదిలిన చిత్ర పెదవులు అమృతాన్ని చిలికించాయి.

"ఎంతవరకూ?" అడిగింది.

"నేను శిల్పం చెక్కేంతవరకు, నీకు శ్రమ అనిపించేంతవరకు."

"సుధాకరా! నేను ఎవరి ఎదుటా నాట్యం చేయలేదు. నీముందు అంతకన్నా చేయలేను. నా నాట్యం దైవం ఎదుటేగాని ఇతరుల ఎదుట చేయడానికి కాదు. దేవదాసినైన నేను మీ కోరిక కనుగుణంగా చేయతగునా? తప్పు కాదూ?" ఆమె పలుకుల్లో గానమే ఒలికింది.

"నీ నియమాన్ని చెరపాలని కాదు. నేను మాత్రం శిల్పం ఎక్కడో చెక్కడం లేదే! నీ అతి సుందర నాట్య విన్యాస విలసిత భంగిమలు ఏ దేవ దేవుని మందిరాన్ని దేదీప్యమానం చేస్తున్నాయో, ఏ వేద పురుషుని పాదారవింద సేవతో పునీతం అవుతున్నాయో, అట్టి దైవ నిలయంలోనే, ఆ సర్వభూతనాథుని అనుగ్రహం చేతనే నాట్య శిల్పంతో దేవతా సృష్టిని చేయాలని నా సంకల్పం. అయినా మా నాన్నగారి ఎదుట అంగీకరించావు. ఇప్పు డీ ప్రశ్న లెందుకు? నీ గురుదేవుని ఆజ్ఞ శిరసావహింపక తప్పదు. అవునా?" కొంచెం అధికారం అనునయంతో రంగరించి పలికాడు.

## బి. ఎస్. ఇందిరాదేవి

వంచిన తల కొంచెంగా పైకి లేపిన చిత్రలేఖ ముంచుకువచ్చిన సిగ్గులతో ముడుచుకుపోయింది. బుగ్గల్లోని గులాబీలు సిగ్గులు దేలాయి.

* * * *

పక్షుల కలగానం, లేదూడల సంతోషం, కలువల నవవికాసం సాయం సంధ్యను తెలియ జేస్తున్నాయి. అల్లంత దూరాన నెలవంక అలవోకగా అల్లనల్లన నడయాడుతూ అప్పుడప్పుడే పైకి వస్తూంది.

గజ్జెలు ఘల్లుమన్నాయి. అచేతనంగా పక్కనున్న ఉలి, సుత్తి అతని చేతుల్లోకి వచ్చాయి. శిరమెత్తి చూచాడు. చిత్రలేఖ సుకుమారమైన శృంగార రసమధుర భంగిమలో నిల్చొని ఉంది. మేలి ముసుగులోని వింత రంగు లామె ముఖ కాంతుల్లో చెల్లాచెదరవుతున్నాయి. అతడు చెక్కుతున్నాడు. కురులు, ఫాలభాగం, కనుబొమలు చెక్కాడు. ఆమెవంక చూచాడు, అలాగే అరమోడ్పు కన్నులతో. చెక్కుతూనే ఉన్నాడు. మళ్ళీచూశాడు, అలాగే అరమోడ్పు కన్నులతో ఆమెవంక..... కాదు....శిల్పం...వంక...కాదు...కోనేటిలోనికలువ వంక.....తాను చెక్కింది ఆమె కంటినా, కలువ రేకునా అని దిగ్భ్రమ చెందాడు. అతడి అచేతన ప్రవృత్తిని చూచి ఆమెకు నవ్వాగింది కాదు. అలాగే చూశాడు. అతని మదిలో మల్లెమొగ్గలు మెదిలాయి. కాదనుకున్నాడు. అతడి నోట్లో నీళ్ళూరాయి. ఆమె పక్కనే దానిమ్మ గింజలు కొరికే చిలుక అదృష్టవంతురా లనుకున్నాడు. అతడి హృదయాన్ని చొచ్చుకొని సుదీర్ఘమైన నిట్టూర్పు వెలువడింది. బంగారు తీవెల్లా మెరిసే చేతి భంగిమలను చెక్కాడు. శంఖం లాగున ఒంపులు దిరిగిన కంఠం పూర్తయింది. వేగం అధికమైంది. కాని....ఒక్కసారి దిమ్మెరపోయాడు. చేతనున్న ఉలి జారిపోయింది. అతడి ముఖంలో చిరునవ్వు చిందింది. ఆ చూపులలోని విచిత్రాన్ని చూచింది. ఆమె కదిలింది. కిలకిల లాడాయి కాలి గజ్జెలు. అతడి సమాధి భంగమయింది.

"కుమార శిల్పీ!" పిలిచింది. ఉలిక్కి పడ్డాడు.

"ఏలనో ఆపివేశారు. ఏమో చూస్తున్నారు. నా భంగిమలో ఏదైనా లోపం కనుపించెనా?" ప్రశ్నించింది.

"ఏమిటీ?....ఉహూఁ...ఏమీ లేదు. జామువేళ అయింది కదూ? రేపు ఇదేవేళకు రావాలి." ఆమె వెళ్తూ ఉంది. వేయి నాగుల వంపులన్నీ ఆమె ఒయ్యారాల్లోనే చిలికాయి.

దినాలు దొర్లుతున్నాయి. నానా రసాభ్యుచిత భంగిమల్లో శిల్పాలు తయారవుతున్నాయి. గడియకో అందం, గంటకో ఆనందం, భంగిమకో








# శిథిల సమాధి

బింకం. చూపుకో పొంకం.

నాడు నిండు పున్నమి. వేయి కిరణాల వెన్నెల వెండి వాగులా ప్రవహిస్తూంది. అపర రతీదేవిలా అలంకరించుకొని సమ్మోహన భంగిమలో నిల్చొని ఉంది వన్నెల రేఖ చిత్రలేఖ. ఇంత అందమైన భంగిమ తా నిదివర కెన్నడూ చూడలేదు. ఒంటి కలుక్కుపోయి ఒంపుల్ని స్పష్టంచేస్తూ విలాస భంగిమ కమనీయమైనట్లు వగలు కులికే ఆ వస్త్రధారణ సుధాకరుని విచలితుణ్ణి చేసింది.

"శిల్పి కుమారా! ఏం ప్రారంభించరు? వేళ మంచిదికాదో? శకునము లోపించెనో, లేక గురియే సరిలేదో!" భంగిమలోనే ప్రశ్నించింది.

"చిత్రా! నేను ఈనాడు శిల్పం చెక్కలేను. ఇంత అందమైన భంగిమల్లో గుంఫితమైన నీ నాట్య మెంత పరవశ కారణమైనదో నేను చూడాలి."

"అంటే?" అదోలా అన్నది.

"నీవు నాట్యం చేయాలి. అదిగో, అటు చూడు. మేరుపర్వతంనుండి దాగుడుమూత లాడుకుంటూ మెల్ల మెల్లగా వచ్చే పిల్ల వాయువులు ఆ స్తిమిత జలపూర్ణ సరస్సు నేవిధంగా చక్కిలిగింతలు పెట్టి కంచివేస్తున్నాయో! ఆ చిన్ని అలల కదలికచే పరవశించే ఆ హంస ఎంత మనోహరంగా ఊగిసలాడుతూందో! అందమంతా తన సొత్తేనని రాయంచకు పోటీ పడుతూ గర్వించే అల్లరి తామర లెలా తరంగాలపై డోలలూగుతున్నాయో! ఇదిగో, ఇటు. ముక్కుతో మేను గీరుకుంటూ మక్కువగా ముచ్చట్లు చెప్పుకొనే చిలకా గోరంకల సందడి చూడు. ఋమ్మని మెంగే తుమ్మెద రాగం మురళీగానమై చెవుల సోకగా పువ్వు కన్నెలన్నీ ఫక్కున నవ్వుకుంటూ గోప కన్నెల్లాగే గొబ్బిళ్ళు సలుపుతున్నాయి, చూశావా? విశ్వమంతా ఈ చలన సౌందర్యంలోనే దీప్యమవుతుంటే మనోమోహనమైన నీ స్థిర రూప సౌందర్యం అభినయ వశంచేత చలించే అంగ విన్యాసంతో జగన్మోహనం కావాలి. అనంతకోటి రూపాల సోయగాలతో విరబోసే ఈ ప్రకృతి చవులూరించి సొగలు కులికే నీ లావణ్యాభినయాలముందు తలవంచాలి. ఆ తీయని హాయిని నే ననుభవించాలి. నీవు నాట్యం చేసితీరాలి." ఆజ్ఞాపించాడు మొండిగా.

"నేను మొదట చెప్పాను—దేవదాసినని, మీముందు నాట్యం చేయనని, నా నాట్యం చూచి పరులు పరవశింపరాదని, దైవం ఎదుట తప్ప ఎవరివద్దా చేయనని!" ఆమె ఆగ్రహించింది. అతడి కివేమీ వినిపించలేదు.

"చిత్రా! నీ నాట్యంలో నవరసాలు ఒలికిస్తే, నీ రాగంలో అనురాగం చిందిస్తే ఇహమే మరిచి, స్వర్గాన్ని చూరగొంటాను. ఆ స్వర్గ ధామాన్ని శిల్పంలో చూపుతాను. నీవలన కళకు సౌందర్యసిద్ధి కలిగిస్తాను. నీ నాట్యం, నా శిల్పం

తోడు నీడలైతే అదే మన తపస్సు యుగాలేలుతుంది. అందుకు నీవు నాదానవు కావాలి. నిన్ను మనసారా కోరుతున్నాను సహధర్మచారిణిగా.''

"సుధాకరా! అంతటితో ఆపివేయండి. పరజీవితాలను, పరుల ఆశయాలను అర్థం చేసుకొనలేని నీవంటి అల్పుని కోరికలకు తల ఒగ్గటం నా అవివేకం. జన్మ సంస్కారంతో వచ్చిన ఈ మహోన్నత శిల్పకళను నీ చిత్త వికారాలకు బలిచేసి సృష్టికే తీరని అపకారం చేస్తున్నావు. తలచిన కార్యాన్ని కొందన్ని, తపనుల యెడ లాపత్రయపడే నీ కొక కోరిక, దాని కొక సిద్ధి! మీ తండ్రియెడ గల అపారమైన భక్తి ఈ నీ నీచ కార్యానికి ఒప్పించింది. ఆ గురు పూజ్యుని కొడుకువైన నీకు ఈ తుచ్ఛమైన కోరిక! ఛీ!'' ఛీత్కరించింది. విసవిస నడిచి వెళ్తోంది.

సుధాకరుని కోపం మిన్నుముట్టింది. జీవితంలో తొలిసారిగా పొందిన అపజయం. అందులోనూ తన నెంతో అల్పునిగా తిట్టి తృణీకరించడం, తన తొలి ప్రేమ విచ్ఛిన్నం కావడం సహింపలేక పోయాడు. మహా శిల్పి చిదానందస్వామి కుమారుణ్ణి వేశ్య, దేవదాసి దూషించడమా? 'ఎంత కండకావరం!' అంతే. చేతునున్న ఇనుప ఉలిని విసిరాడు. "అమ్మా!" అనే ఆర్తనాదం అతడి పశు ప్రవృత్తిని మేలుకొలిపింది. అతడు పరుగెత్తాడు. నేల ప్రాలిన చిత్రలేఖను చూచి నీరు గారిపోయాడు. రక్తసిక్తమైన ఆమె తలను తన తొడపై నిడుకొని రక్తస్రావాన్ని ఆపుతున్నాడు. ధారలై కారే అతని కన్నీరు చిత్రలేఖ రక్తధారలతో మేళవించి వరదలై ప్రవహించింది.

"చిత్రలేఖా! నన్ను క్షమించు." అతడి కన్నీళ్ళ ప్రతిబింబం ఆమె కళ్ళలో కనుపించింది. ఆమె అతడి వంకే చూస్తున్నది.

"కాదు, స్వామీ. మీరే నన్ను క్షమించాలి. అంతిమ ఘడియల్లోనైనా నా తలపు తెలుపుతాను. మీకన్న ముందే నేను మనసిచ్చాను. పుచ్చుకోలేక తపించాను. సమయంకోసం చేతులు చాచాను. నేనుగా చెప్పుకోలేని దీనను. ఆ సమయం ఈ విధంగా నాకు పరిమితమైంది. అయితే నా ఈ కోరికను వెల్లడిస్తే మీ కోరిక నెరవేరదని భావించి మీ రందించినా అందుకోలేని అభాగ్యురాలనయ్యాను, స్వామీ! నా భంగిమల్లోనే మైమరిచిన మీరు, నా సహవాసంలో, నా సాన్నిధ్యంలో సర్వమూ మరిచి మీ ఆశయాన్ని సాధింపలేరు. అందుకనే ధిక్కరించి మీ మనసు నొప్పించాను. నా హృదయగత ప్రణయాన్నే వంచించుకున్నాను. నా మదిలో, నా ఎదలో మెదులాడే మీరే నా స్వామి." ఆమె స్వరం క్షీణించింది. "మీ చేతుల్లో రాలి ..పోవటం...నా.....అ....... దృష్టం...నన్ను...నన్ను....క్ష....మించ ...రూ?" ఆమె ప్రాణవాయువు లనంతవాయువుల్లో లీనమయ్యాయి.

పెనుగాలివీచింది. గుండెలు గుభిల్లుమన్నాయి. దిక్కు దిక్కున మలచిన కళాఖండాలు ఖంగుమన్నాయి. పర్వతాలు ఒళ్ళు విరుచుకున్నాయి. భూమి దద్దరిల్లింది.

"నాయనా! సుధాకరా!" అనురాగపూర్ణమైన స్వరం వినిపించింది. నిమీలిత నేత్రుడైన తన తండ్రి తల నిమురుతూ ఉన్నాడు. ప్రళయం శాంతించింది.

"బాబా!" ఏడుపు మిక్కుటమైంది. ముఖాన్ని తండ్రిపాదాలపై రాస్తున్నాడు.

"కుమారా! లే, నాయనా! దుఃఖించకు. ఇప్పటివరకు నీవున్నది ఒక సమాధి నిష్ఠలో. అందు నీవు మననం చేసిన భావనలే జరిగిన సంఘటనలు. ఆ మననమైన భావాలే శిథిలమయ్యాయి. నీవు భావించిన వస్తువు మలిన భావంతో మననమైనది. అందుకే నీ శిల్పనిర్మాణం సమగ్రస్థితి నందలేదు. ఇప్పుడైనా తెలిసికొన్నావా- పవిత్రమైన దేవాలయాలలో ప్రణయ లీలలు నేర్పే శిల్పాల నెందుకు చిత్రించలేదో? ఇది భగవంతునినుండి వచ్చినదే అయినా ఉండ



వలసిన స్థలాలు వేరు. ఇక లే. ముక్కోటి ఆంధ్రులకు ముక్తినిచ్చే పవిత్రమైన దేవదేవుని శిల్పాలు చెక్కు. రజస్తమ సంబంధమయిన మలినత్వాన్ని ఉజ్జగించి శుద్ధమైన మనోలోకమందలి సత్త్వకోశాన్ని ఆశ్రయించు. ఇదే కర్మేంద్రియజ్ఞానం. ఇవి బ్రహ్మానందం. పరబ్రహ్మతత్త్వం. నీవు అపవిత్రశీలంతో తలపెట్టావు గనుకనే అది కొనసాగలేదు. ఈ ఉద్దేశాలకు నీవలన నాంది జరిగింది. నవీన నాట్య శిల్పాలకు నీ ఈ తలంపే కారణం. ప్రాక్తన కళాఖండాలకు పరిసమాప్తం నీవల్లనే జరుగుతుంది. ముందు యుగాలలోని శిల్పులు దాంపత్య సుఖజీవులు, భోగలాలసులు, రాజాశ్రితులుగా అవతరిస్తారు. ఇది చరిత్ర కారణమైన అనుభూతి మాత్రమే. దీనికి మూల పురుషుడవు నీవే. జరిగినదానికి విచారించకు. మిగిలిపోయిన నీ కర్తవ్యాన్ని పాటించు. నా ఆశయాన్ని నెరవేర్చు." మెల్లగా లేవనెత్తాడు.

"బాబా! నాకు జ్ఞానోదయం కలుగజేశావు. భగవంతుని సాన్నిధ్యంలోనే నా ఈ శేష జీవితాన్ని గడుపుతాను. మీ చిరాశయాన్ని సాధిస్తాను."

గుడిగంటలు ఖంగుమన్నాయి. కళామతల్లి కన్నుల్లో కాంతులు నిలిచాయి. శిలాప్రతిమలు సజీవంగా తలలూపాయి. తండ్రి కన్నుల్లో ఆనందాశ్రువులు.

పవిత్ర ప్రణయమూర్తి చిత్రలేఖకు దహన సంస్కారం జరిగింది. మింటికెగసిన మంటల్లో ఆ స్వార్థత్యాగిని కరకంకణ నిక్వణాలు కణకణమంటూ మిళితమయ్యాయి. సౌందర్యకాంతులు అగ్నికీలలై సువిశాలమైన ఆకసాన్ని ఆవరించాయి. సుడులు సుడులుగా తిరుగుతూ వచ్చిన పొగల సమూహాలు చేరువనే నిల్చొని ఉన్న శిల్పి కుమారుని పలుమార్లు కౌగలించి, అనునయించి పోతున్నాయి. చితిమంటలను ఛేదిస్తూ చిటుక్కున లేచిన ఒకానొక అగ్నిశిఖ దీపశిఖలా దీప్యంగా విశ్వకాంతిలో విలీనమయింది.

దహనక్రియలు జరిపిన తండ్రీ కొడుకులు వెనుదిరిగారు.

'అసతోమా సద్గమయ
తమసోమా జ్యోతిర్గమయ
మృత్యోర్మా అమృతంగమయ.

చిదానంద స్వామి మందిరంలో నుండి శిష్యులు భక్తితో చేసే రాగాలాపన సన్నగా వారి చెవులను సోకి హృదయాలలో పన్నీటి జల్లు కురిపించింది. తండ్రిని పాదివి పట్టుకున్న సుధాకరుడట్లే దేవదేవుని దివ్యపాదార విందాలపై పడిపోయాడు.

● ● ●

నాటి ప్రయత్నమే కాబోలు నేటి నాట్య శిల్పంగా, నాట్యశిల్పం ప్రణయశిల్పంగా, ప్రణయ శిల్పం కామరూప శిల్పంగా గుడిగోపురాలపై, రథాలపై అసభ్యంగా వెలిసిన చిత్రాలు! ఇవి మారడానికి మళ్లీ ఏ మహాశిల్పి పుట్టాలో! ★